www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 2 డిసెంబర్ 2023
5
వైఎస్ఆర్



ఇ-ఆఫీస్ విధానం అమలు కావాలి : జెసి

ప్రజాశక్తి - కడప

జిల్లా స్థాయి నుంచి గ్రామ సచివాలయ స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ-ఆఫీస్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని జెసి కలెక్టర్ జి. గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ-ఆఫీస్ అమలు, సంస్థలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ-ఆఫీస్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ఇప్పటికే ఆచరణలో ఉందని, అన్ని శాఖల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఇంకనూ ఆచరణలో లేని శాఖలు అందుకు సంబంధించిన కనీస మౌలిక వసతులను వెంటనే సమకూర్చుకోవాలన్నారు. అన్ని శాఖలు జిల్లా స్థాయి నుండి గ్రామ సచివాలయ స్థాయి వరకు ఇ-ఆఫీస్ విధానాన్ని పక్కాగా ఆచరణలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

వాన ముసురు

మోస్తరు జల్లులతో సరి
రబీ ఆశలపై సందేహాలు
రాష్ట్రంలోనే అధిక వర్షపాత లేమి

జిల్లాలో ముసురు వాతావరణం కొనసాగుతోంది. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం ఉంటుందనే వాతావరణశాఖ హెచ్చరికల ప్రభావం కనిపిస్తోంది. ఆకాశమంతటా తెల్లటి మబ్బులతో కూడిన వాతావరణం కొనసాగుతోంది. చల్లటి గాలులతో కూడిన చలివాతావరణం కొనసాగింది. మధ్య మధ్యలో మోస్తరు జల్లుల సందడి కనిపించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్ సాగుకు అవసరమైన రీతిలో వర్షపాతం నమోదు గాకపోవడం ఆందోళన కలిగించింది. రబీ సీజన్‌లో నేటి వరకు -91.2 శాతం రాష్ట్రంలోనే అత్యధిక లోటు వర్షపాతం కొనసాగుతున్న నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లాలోని కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ రెవెన్యూ డివిజన్లలో 36 మండలాలున్నాయి. వీటి పరిధిలోని 26 మం డలాల్లో వ్యవసాయ బోర్ల కిందకే వరి సాగు పరిమితమైంది. మిగిలిన బుడ్డశనగ, వేరుశనగ, మి నుములు, పత్తి, సోయామీన్ సాగుకు ఆశాజనక వర్షపాతం కోసం రైతాంగం ఎదురుచూస్తోంది. అన్నమయ్య జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గాల్లో పండ్లతోటలతో సహా వేరుశనగ తదితర పంటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో వర్షాలు కురివని నేపథ్యంలో రబీలో మోస్తరు వర్షపాతం నమోదుపై రైతులు పెం చుకున్న ఆశలు అడియాశలు అవుతుండడం గమనార్హం.



చాపాడు : ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడవకుండా ప్లాస్టిక్ పట్టలు కప్పిన రైతులు

పదును దాటని వర్షం

జిల్లాలో పదునుపాటి వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలో 51 మండలాల్లో చేతివేళ్లపై లెక్కించదగిన రీతిలో మోస్తరు జల్లులతో కూడిన వర్షపాతం నమోదుకు పరిమితమైంది. కడప, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గ ప్రాంతాల్లో మోస్తరు జల్లులతో కూడిన వాతావరణంతో సరిపెట్టింది. ఫలితంగా కడప జిల్లా వ్యాప్తంగా 3.76 లక్షల ఎకరాల్లో 2.80 లక్షల ఎకరాల వరకు బీళ్లుగానే మిగిలి పోయాయి. రబీలో ఖరీఫ్ తరహా వర్షాభావ పరిస్థితులే కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రబీలో నేటి వరకు 33 శాతం లోటు వర్షపాతం కొనసాగు తుండడం గమనార్హం.

బుడ్డశనగ సాగు ప్రశ్నార్థకం!

జిల్లాలోని 26 నుంచి 33 మండలాల్లో నూనె గింజల ఆధారిత పంటలు సాగు కావడం తెలిసిందే. ఖరీఫ్ సీజన్ నాటి పరిస్థితులే కొనసాగుతున్న నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో ప్రధాన ధాన్య ఆధారిత పంటలైన బుడ్డశనగ, వేరుశనగ, పత్తి, మినుములు, సోయాబీన్ ప్రధాన పంటల సాగుకు అవసరమైన పదును పాటి వర్షం నమోదు గాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2023-24 రబీ సీజన్ సాగులో నూనె గింజల ఆధారిత అత్యధిక వాటా వీటిదే. గతేడాది తరహాలోనే బుడ్డశనగ సుమారు 2,32,360 ఎకరాలు, మినుము 22,915 ఎకరాల్లో గణనీయంగా సాగవుతోంది. వీటితోపాటు వేరుశనగ, పత్తి, సోయాబీన్ పంటలు సాగవుతున్నాయి. ప్రతి ఏటా అక్టోబర్ ఒకటి నుంచి ఆశాజ నకంగా వర్షపాతం నమోదు కావడం తెలిసిందే. గత వాతావరణ పరిస్థితులకు వ్యతిరేకంగా ఆశా జనక వాతావరణ పరిస్థితుల లేమి కారణంగా సుమారు 22 రకాల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

'ఆడుదాం ఆంధ్ర' జోరు

- తొలిరోజే 16 వేల రిజిస్ట్రేషన్లు
- 371 మైదానాల గుర్తింపునకు యత్నం
- సచివాలయాలకు క్రీడా కిట్లు తరలింపు



చెన్నూరులో సచివాలయాలకు క్రీడాకిట్లు అందజేస్తున్న ఎంపిపి (ఫైల్‌ఫోటో)

జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడల కసరత్తు జోరందుకుంది. గత నెల 27వ తేదీ నుంచి 2024 ఫిబ్రవరి మూడవ తేదీ వరకు క్రీడల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. మొదటిరోజే 16 వేల రిజిస్ట్రేషన్లు నమోదు కావడం ఉత్సాహాన్నిస్తోంది. ప్రభుత్వం క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడల కిట్లను జిల్లా కేంద్రానికి సరఫరా చేసింది. క్రికెట్‌తోపాటు ఒలింపిక్ పోటీలకు అర్హత కలిగిన క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి ఉంటే సమకాలీన పోటీలకు అవసరమైన మానవ వనరులు లభించేవనడంలో సందేహం లేదు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాను క్రీడల పండుగ పలకరించనుంది. కలెక్టర్ పర్యవేక్షణలో స్టెప్ అధికారులు, జిల్లా కేంద్రంలోని ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో ఆడుదాం ఆంధ్ర క్రీడల పండుగను పట్టాలకు ఎక్కిస్తున్నారు. జిల్లాలోని 565 సచివాలయాల పరిధిలోని క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నడుస్తోంది. ఈ నెల ఐదవ తేదీ వరకు రిజిస్ట్రేషన్ల నమోదు కొనసాగనుంది. అనంతరం ఆయా సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ల నమోదు కొనసాగించాలని భావిస్తోంది. వేలాది మంది క్రీడాకారులు సందడి చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

వేధిస్తున్న మైదానాల కొరత

జిల్లాలోని 565 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలోని హైస్కూళ్లలో సుమారు 250 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన 265 సచివాలయాల పరిధిలోని మైదానాలకు వ్యాయామ ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. 371 సచివాలయాల పరిధిలో మైదానాలు లేనట్లు తెలుస్తోంది. స్టెప్ అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. క్రీడల నిర్వహణలో ఎటువంటి అడ్డంకులు తలెత్తకుండా ఉండటానికి ఇతర సచివాలయాల పరిధిలోని మైదానాలను సరద్దుబాటు చేసు కోవాలని సూచనలు చేసింది.

న్యాయనిర్ణేతలుగా వాలంటీర్లు

జిల్లాలోని ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో వాలంటీర్లు కీలకంగా మారనున్నారు. జిల్లా వ్యాప్తంగా 250 మంది వ్యాయామ ఉపాధ్యాయుల కొరత ఏర్పడి నేపథ్యంలో ఎంపిక చేసిన వాలంటీర్లకు అధికార యంత్రాంగం క్రీడల్లో శిక్షణ ఇచ్చింది. వాలంటీర్ల సహకారంతో కొరత ఏర్పడిన ప్రాంతాల్లో వాలంటీర్ల సేవలను వినియోగించ నుంది. మైదానాలు కొరత కలిగిన సచివాలయ ప్రాంతాల్లోని ఐదు కిలోమీటర్ల లోపు సచివాయాల దగ్గర క్రీడలు నిర్వహించాలని సూచించింది. రిజిస్ట్రేషన్ల ఊపు, మైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయుల కొరత ఏర్పడిన నేపథ్యంలో ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీల నిర్వహణ జయప్రదంపై సందేహాలు వ్యక్తమవుతుండడం గమనార్హం.

జయప్రదంగా నిర్వహిస్తాం

ఆడుదాం ఆంధ్ర పోటీలను జయప్రదం చేసి తీరుతాం. కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా కేంద్రంలోని ఇతర శాఖల సహకారం, సమష్టి సమన్వయాలతో విజయవంతంగా నిర్వహిస్తాం. మానవ వనరుల కొరతను సైతం దిగ్విజయంగా అధిగించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చుతాం.

- సాయిశ్రీ గ్రేస్, స్టెప్ జిల్లా అధికారి, కడప.

ద్రాగా ముగిసిన మ్యాచ్

ప్రజాశక్తి - కడప



తలపడుతున్న నార్త్, సెంట్రల్ జోన్ జట్లు

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-23 మెన్ మల్టీ డే ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీలో భాగంగా కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో మూడు రోజులపాటు నార్త్ జోన్, సెంట్రల్ జోన్ జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్ జట్టు 639 పరుగులు చేసింది. నాలుగు వికెట్ల నష్టానికి 121 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 66.0 ఓవర్లలో 173 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని దుర్గా బాలాజీ 55 పరుగులు చేశాడు. నార్త్ జోన్ జట్టులోని శ్రీకర్ సాయి రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. నార్త్ జోన్ జట్టు సెంట్రల్ జోన్ జట్టుకు ఫాలో ఆన్ ఇచ్చింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ జట్టు ఆట ముగిసిన సమయానికి 26.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. అలానే కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో సౌత్ జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్ల మధ్య నిర్వహించిన వేరొక మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్ లో రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు 362 పరుగులు చేసింది. ఆరు వికెట్ల నష్టానికి 323 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన సౌత్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 104.0 ఓవర్లలో 398 పరుగులకు ఆల్ అవుట్ అయింది.

దళితుల సామాజిక న్యాయం కోసం చలో ఢిల్లీ

ప్రజాశక్తి - కడప అర్బన్

దళితుల సామాజిక న్యాయం కోసం చలో ఢిల్లీ, మహాధర్నా విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప రైల్వేస్టేషన్‌లో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులకు సామాజిక న్యాయం సాధన కోసం చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్లే వారిని సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల పరిరక్షణ కోసం, సామాజిక న్యాయం కోసం దళిత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న చలో ఢిల్లీలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సామాజిక పౌర హక్కులు, దళితల భూమి సమస్యలు, ఆర్థిక అభివృద్ధి తదితర 21 డిమాండ్ల పరిష్కారం కోసం భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకి కోటి సంతకాలతో కూడిన విజ్ఞాపన పత్రం ఇవ్వనున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎన్.వీరయ్య, ఎస్.గురువయ్య, రాయప్ప , నరసింహులు, అజయ్, అన్నమయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జయరామయ్య, కార్యకర్తలు చలో ఢిల్లీ కార్యక్రమం వెళ్లిన వారిలో ఉన్నారు.

వాలంటీర్ల వేతనాల్లో కోతలు

అందులోనూ వ్యత్యాసాలు
లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాల్లో భాగంగా వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారు. దాదాపు రెండున్నర లక్షల మంది నిరుద్యోగులకు జీవనోపాధిని కల్పిస్తున్నారు. జగనన్న ప్రభుత్వానికి వెన్నుముకగా ఉన్న వాలంటీర్లకు నెలకు రూ.5000 చొప్పున గౌరవ వేతనాన్ని ఇస్తున్నారు. ఈ వేతనం మీదనే ఆధారపడి జీవిస్తున్న వాలంటీర్లు ఎందరో ఉన్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించకపోవడం అన్న చందంగా గోపవరం సచివాలయం - 5లో నవంబర్ నెలకు సంబంధించి శుక్రవారం వాలంటీర్ల వేతనాలు జమ అయ్యాయి. వారి వేతనాల్లో భారీ కోతలు విధించారు. విధించిన కోతల్లోనూ వ్యత్యాసం ఉండడం గమనార్హం. ఎందుకని సచివాలయ ఇన్‌ఛార్జి కార్యదర్శి సునీల్ కుమార్‌ను వారు ప్రశ్నిస్తే 'మీ అటెండెన్స్ తక్కువ ఉంది' అని సమాధానమిచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంలో మూడు రోజులు బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. సచివాలయానికి వెళ్లినప్పుడు కొన్నిసార్లు సర్వర్ పని చేయకపోవడం వల్ల తమ బయోమెట్రిక్ శాతం తక్కువగా ఉందని, క్షేత్ర స్థాయిలో కష్టపడుతున్న తమ గౌరవ వేతనాల్లో కోతలు విధించడం సమంజసం కాదని వాలంటీర్లు వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది చేయాల్సిన పనులను కూడా వారి లాగిన్‌లు, పాస్వర్డ్‌లు వాట్సాప్ గ్రూప్‌లో పెట్టి వాలంటీర్లచే చేయించడం గమనార్హం. స్పందనలో వచ్చిన ఫిర్యాదులు కూడా పంచాయతీ కార్యదర్శి లాగిన్‌లో వాలంటీర్లే ఫిర్యాదుదారుని ఇంటి వద్దకు వెళ్లి బయో మెట్రిక్ వేస్తున్నారు. సచివాలయ సిబ్బంది తాము చెప్పిన పని చేయకపోతే మెమోలు జారీ చేస్తామని వాలంటీర్లను బెదిరిస్తున్నారు. గోపవరం సచివాలయం - 5 యానాది కాలనీలో ఉన్నందున లింగా రెడ్డి నగర్‌లో ఉంటున్న వాలంటీర్లు ఆటోలలో వెళ్లి రావడానికి రోజుకు రూ. 60 ఖర్చవుతుంది. ఆటో ఖర్చు గౌరవ వేతనాల్లో కోత విధించడం వల్ల తాము ఎలా జీవించాలని వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే తమ సమస్యలను పరిష్కరించాలంవేడుకుంటున్నారు.

రెండోదశ కౌన్సెలింగ్ నిర్వహించాలి : 'రూట'


ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలలో పీజీ ఉర్దూ ప్రవేశ అభ్యర్థులకు రెండోదశ కౌన్సెలింగ్ నిర్వహించాలని, కేవలం మొదటి దశ కౌన్సెలింగ్ మాత్రమే నిర్వ హించడం వల్ల చాలామంది అభ్యర్థులు ప్రవేశం పొందలేకపోయారని, రూట లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసీవుల్లా కోరారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి స్పందిస్తూ ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్ హేమచంద్ర రెడ్డికి ఫోన్ ద్వారా సమస్యను వివరించి రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్ర రెడ్డి స్పందిస్తూ పీజీ ప్రవేశ అభ్యర్థులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం ను ఉర్దూ మీడియంలో కూడా నిర్వహించాలని సమగ్ర శిక్ష ఎస్‌పీడీ బి. శ్రీనివాసరావుకు ఉపముఖ్యమంత్రి ఫోన్ ద్వారా ఆదేశించగా త్వరలోనే నిర్వహిస్తామని తెలిపారు . కార్యక్రమంలో రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్లా, సమన్వయకర్త ముహమ్మద్ అయుబ్, నాయకులు డాక్టర్ అంజద్ అలి, డాక్టర్ ఖాజాపీర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతిపత్రం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సమగ్ర శిక్షలో సుమారు 12 సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను గుర్తించి వేతనాలు పెంపుదలకు కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డిని కోరారు. శుక్రవారం ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం విద్యాశాఖకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. సమగ్ర శిక్షలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల పట్ల అంతటి ప్రాధాన్యత ఇచ్చి వారి బతుకు చక్రం సజావుగా సాగేందుకు కృషి చేయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి జీవన మనుగడకు మంచి సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయ కుమారి, రాజు, సిద్ధారెడ్డి, సిఆర్‌పిలుశంకర్, ఎం.వి. నాగమణికుమారి, హాజిరాబాను, జమీలునిసా, రామచంద్ర, మురళీకృష్ణ, మెసెంజర్ చిన్నయ్య, పాల్గొన్నారు.

'మాధవిరెడ్డిని విమర్శించడం తగదు'

కడప అర్బన్ : కడప నియోజకవర్గ టిడిపిఇన్‌ఛార్జి మాధవి రెడ్డిని వైసిపి మహిళలు విమర్శించడం ఏమాత్రం తగదని తెలుగుదేశం పార్టీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రామలక్ష్మమ్మ, నగర మహిళా ప్రధాన కార్యదర్శి పార్వతి అన్నారు. శుక్రవారం ద్వారకా నగర్‌లోని మాధవి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మహిళ అని మరిచి వైసిపి మహిళలు మిడిమిడి జ్ఞానంతో హేళనగా మాట్లాడడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ఒక కులాన్ని కించపరుస్తూ విమర్శలు చేయడం, ఆ కులాన్ని అవమానించపరచడమే అన్నది వారికి తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషను, పేరు పెట్టి సంబోధిస్తే తప్పేముందో తమకు అర్థం కావడం లేదన్నారు. ఎంపీగా శ్రీనివాస రెడ్డి ఓడినా సిసి కెమెరాలు ఏర్పాటు చేసింది గుర్తు ఎరగాలని, వారు గుర్తు చేశారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన అంజద్ బాషా అభివృద్ధి ఏమి చేశారని, ఆయన ఆర్థికంగా అభివృద్ధి చెందడం జగమెరిగిన సత్యం విమర్శించారు. మాధవిని విమర్శించిన వైసిపి మహిళలు ఎమ్మెల్యే కాక మునుపు ఆయన ఆస్తి ఎంత, ఇప్పుడు ఉన్న ఆస్తి ఎంతో అడగాలన్నారు. ఇప్పటికైనా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి రెడ్డి గెలుపుకు మహిళలుగా కృషి చేయాలని హితవు పలికారు. సమావేశంలో కటారి స్వర్ణలత, శ్రీదేవి, లక్ష్మీదేవ పాల్గొన్నారు.

'అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన'

ప్రజాశక్తి-కడప అర్బన్



కడప : ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ, కమిషనర్

అవగాహనతోనే ఎయిడ్స్‌ను నిర్మూలించవచ్చని డిఎంహెచ్ఒ డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 'ప్రపంచ ఎయిడ్స్ దినం, సంఘాలను నడిపించనివ్వండి' అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి నగర పాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్. రవిబాబు, డాక్టర్ ఉమామహేశ్వర్‌రావుతో కలిసి డిఎంహెచ్ఒ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సంవత్సరం 'సంఘాలను నడిపించనివ్వండి' అనే నినాదం తీసుకు వచ్చిందని తెలిపారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా న్యాయ సేవ అధికారి, సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జ్ బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు చట్టం దృష్టిలో అందరు సమానమని పేర్కొన్నారు. వారికి 2017 సవరణ చట్టం అండగా ఉం లటుందని చెప్పారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రావిద్రనాథ్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి /ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నిర్మూలనకు హెచ్ఐవి పరీక్ష చాలా కీలకమన్నారు. కార్యక్రమానికి రిమ్స్ మెడికల్ కళాశాల విభాగ హెచ్ఒడి మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ లక్ష్మీ సుశీల, సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడు :** ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి శ్రీవాణి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చాపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ 1988 డిసెంబర్ 1నుంచి ఎయిడ్స్ డే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధికారక హెచ్ఐవికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్య మాధురి, డాక్టర్ఓబులేసు, సిహెచ్ ఓ మహదేవ్ యాదవ్, సిబ్బంది రమేష్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. **మైదుకూరులో...** స్థానిక బాల శివ యోగేంద్ర మహారాజ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ బి సురేష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వైస్ ప్రిన్సిపల్ భూమిరెడ్డి రవి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు చేయి చేయి కలుపుదాం అంటూ విజయ హాల్ నుండి మార్కెట్ మీదుగా కడప రోడ్డు అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా చేపట్టి శ్రీకృష్ణదేవరాయల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, వేణుగోపాల్ నాయక్, గంగులయ్య , నవీన్, విజయ్, శేఖర్ ,ప్రసాద్ రెడ్డి ,సురేంద్ర , విద్యార్థులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** గ్రామాల్లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించి ప్రజల్లో భయాందోళనలు పోగొట్టాలని కృష్ణ శారద కళాశాల ప్రిన్సిపల్ జయప్రద పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం పట్టణంలోని గాంధీ బొమ్మ విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించి ప్రజల్లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.వి.మోహన్ రెడ్డి, ప్రభాకర్, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నగర పంచాయతీలో, మండలంలోని చిలంకూరు గ్రామంలో స్థానిక పిహెచ్‌సి వైద్యులు ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సాయి చరిత రెడ్డి, జోత్స్న, శ్రీనాథ్, హెల్త్ ఎడ్యుకేటర్ నాగ మునిరెడ్డి, సూపర్‌వైజర్లు ఓబులేసు,సుభద్ర, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) :** పట్టణం లోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హెచ్ఐవిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి చంద్రశేఖర్ రెడ్డి, కరస్పాండెంట్ ఎల్.తరుణేంద్ర శేఖర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీకృష్ణ గీత ఆశ్రమం, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంల విద్యార్థులు ఎయిడ్స్ డే సందర్భంగా నినాదాలు చేస్తూ స్థానిక గీత ఆశ్రమం నుంచి గాంధీ రోడ్డు నందు ర్యాలీగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ముస్తఫా, రామ్మోహన్, శారద, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ గౌరీ శంకర్, మౌనయ్య,ఎన్సిసి ఇన్‌స్ట్రక్టర్ దావీద్, విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** ప్రాంతీయ ఎయిడ్స్ నివారణ విభాగం, నల్లపురెడ్డిపల్లి ప్రాథమిక వైద్యాశాల, స్నేహిత అమృత హస్తం సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణుష్ రావు, ప్రిన్సిపల్ వర లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సెల్వన్ రాజు, నల్లపురెడ్డి పల్లి ప్రాథమిక వైద్యాశాల డాక్టర్ లిఖిత, నగరిగుట్ట పట్టణ ప్రాథమిక వైద్యాశాల వైద్యులు డాక్టర్ స్నేహ - ప్రత్యూష ప్రారంభించారు. ఆసుపత్రి నుండి ప్రారంభమైన ర్యాలీ పూల అంగళ్ల కూడలి వరకు చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసిటిఎస్ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, ఎస్‌టిఐ కౌన్సిలర్ బాదల్ వలీ, సబ్ యూనిట్ అధికారులు సతీష్, సిద్దయ్య, పిఎంఒ సుబ్బారెడ్డి, టీబీ హెల్త్ విజిటర్ భాగ్యలక్ష్మి ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, నేత్రనిధి టెక్నీషియన్ హరీష్, సభ్యులు రాఘవేంద్ర రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు. **వేంపల్లె :** ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి యవతతో పాటు ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, తహశీల్దార్ చంద్ర శేఖర్ రెడ్డిలు కోరారు. జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వేంపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంల ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీతో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటిల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు తహశీల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ మల్లేశ్వరమ్మ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు శ్రీకాంత్ రెడ్డి ,డాక్టర్ మల్లేశ్వరమ్మ, శ్రీనివాసన్, రాజారెడ్డి ,ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తిరుపతి రెడ్డి, రమేష్, విశ్వనాథ్, దీప్తి, ఐసిటిసి కౌన్సిలర్ ఆంజనేయులు, ఎఎన్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

ప్రజాశక్తి-కడప అర్బన్



రక్తదాతలకు మెమొంటోను అందజేస్తున్న అతిథులు

దూదేకుల హక్కుల పోరాట సమితి 13వ రక్తదాన శిబిరంలో కులమతాలకు అతీతంగా యువత రక్తదానం చేయడం అభినందనీయమని సమితి రాష్ట్ర అధ్యక్షులు మన్నూరు అక్బర్ అన్నారు. శుక్రవారం పాత కలెక్టరేట్ ఎదుట రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది డిసెంబర్ 1న రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రక్తదానం చేసేందుకు యువత అధిక సంఖ్యలో రావడం సంతోషాన్నిచ్చిందన్నారు. పౌష్టికాహార లోపం వల్ల ఎంతోమంది రక్తహీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పౌష్టికాహారం ప్రజలకు అందివ్వడంలో బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. దిశా డిఎస్‌పి రమాకాంత్ మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాన్ని కొనసాగిస్తూ ఉండడం అభినందనీయమని చెప్పారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌జిఎస్ డివిజనల్ డెవలప్మెంట్ అధికారి జుబేదాబేగా, ప్రముఖ రాష్ట్ర మైనార్టీ నాయకులు ముక్తియార్, అమీర్ బాబు, సుభాన్ బాషా, నూర్ మహమ్మద్, రిటైర్డ్ ఎస్పి షేక్ షావలి, నబి రసూల్, హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, సమితి రాష్ట్ర కోశాధికారి రూపనగుడి హుస్సేన్, కార్యదర్శి నజీర్, గౌరవ సలహాదారు పగిడాల ఓబులేసు, బాబయ్య పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జుబేదాబేగం రక్తదాతలకు మొమెంటోలు ప్రదానం చేశారు.

రాజకీయాలు తెలుసుకుని మాట్లాడాలి : వైసిపి

ప్రజాశక్తి - కడప

తెలుగుదేశం పార్టీ నాయకులు రాజకీయాలు తెలుసుకొని మాట్లాడితే పద్ధతిగా ఉంటుందని వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అతిరథ మహారథులైన ముగ్గురు నాయకులను తెలుగుదేశం పార్టీ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. 2014-19 వరకు అధికారంలో ఉన్న టిడిపి కడప నియోజకవర్గాన్ని నిధులు రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఒక్క వార్డు మెంబర్ కూడా గెలవలేని టిడిపి ఇప్పుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించడం తగన్నారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు బండి ప్రసాద్, కె. బాబు, త్యాగరాజు, ఎస్‌సి సెల్ నగర అధ్యక్షులు చైతన్య, కో-ఆప్షన్ మెంబర్ కంచుపాటి బాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'జలవివాదాన్ని కేంద్ర ప్రభుత్వమే పరిష్కరించాలి'

కడప అర్బన్ : ఇరు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టైన నాగార్జున సాగర్ జలవివాదం ఎన్నికల ముందే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని లేకపోతే ముదిరి పాకాన పడి ప్రాంతీయ తత్వం మరల రగిలితే ఇరు తెలుగు రాష్ట్రాల ప్రజలుకు ఇబ్బంది కల్గుతుందని సంఘ సేవకులు అన్నారు. శుక్రవారం వైవి స్ట్రీట్‌లోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల కొన్ని గంటల ముందు సాగర్ డ్యామ్ వద్దకు పోలీసు బలగాలను పంపించి కుడి కాలువ 13 క్రస్ట్ గేట్లను తెరిపించి నీటిని విడుదల చేయించారని చెప్పారు. సాగర్, కావేరి జల వివాదాలు ఇరు రాష్ట్రాల్లో సున్నితాంశంగా మారాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో నీటి కొరత ఉన్న మాట వాస్తవమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కాపాడుకోవడం కోసం రాజీలేని పోరాటం చేయాల్సి అవసరమెంతైనా ఉందన్నారు.


మాట్లాడుతున్న సంఘాల నాయకులు

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి హామీ

ప్రజాశక్తి-ఖాజీపేట

అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఉన్నత అధికారులు సానుకూలంగా స్పందించారని సిఐటియు, ఎఐటియుసి, ఎఫ్‌టియు సంఘాల ప్రతినిధులు జె.గంగావతి, బేబీ రాణి, ప్రేమ, లలిత, జ్యోతి, సుబ్బారామమ్మ శుక్రవారం తెలిపారు. ఈ నెల 8, 9, 10 తేదీలలో జాతీయస్థాయి కమిటీ సందర్శించనుందని, ఉన్నతాధికారుల సూచన మేరకు, వారి హామీ మేరకు అంగన్వాడీల సమ్మె ఉద్యమాన్ని వాయిదా వేసుకున్నామని చెప్పారు. మినీ అంగన్వాడి టీచర్లను మెయిన్ టీచర్స్‌గా గుర్తించడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపారని, సుప్రీం కోర్ట్ ఇచ్చిన గ్రాట్యూటీ తీర్పును మన రాష్ట్రంలో కూడా అమలు జరిగేలా ఉత్తర్వులు జారీ, విధుల్లో చనిపోయిన అంగన్వాడీ సిబ్బందికి దాన సంస్కారాల నిమిత్తం రూ. 20వేలు ఇచ్చేలా ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు అధికారులు తెలిపారన్నారు. విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరగా ప్రభుత్వానికి ఫైల్ పంపినట్లు అధికారులు తెలిపారన్నారు. అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఉన్నత అధికారులు తెలియజేశారని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శివ మునెమ్మ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. కడప నగరంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ విభాగంలో హ్యాండ్ బాల్ పోటీలను జిల్లా హ్యాండ్ బాల్ చీఫ్ కోచ్ అబ్దుల్ మునాఫ్ నిర్వహించారు. ఈఎంపికల్లో బాలుర జట్టుకు వెంకట్రావు, ప్రతాప్ రాజు, ఆది శేషారెడ్డి, పునేష్ కుమార్, శివ కుమార్, లింగరాజు, జయరాములు, మల్లికార్జున, నిఖిల్, సూర్య ప్రకాష్, విష్ణు వర్దన్, ఉదయ్ సాయి, ఓంకార్, ఈశ్వర్, అనిల్ కుమార్, హేమంత్, నగేష్ , బాలికల జట్టుకు దేవిక, జయశ్రీ, ప్రసన్న కుమారి, కావ్య, పల్లవి, సాయి కళ దివ్య రాజమ్మ, చంద్రకళ, ఆయేషా, మహిత, లలిత, వెంకట దీపిక, మేఘన గంగోత్రి, జాహ్నవి, సన, పల్లవి, లోహిత, సుమశ్రీ, స్వాతిలు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. డిసెంబర్ 8,9,10 తేదీల్లో తెనాలిలో నిర్వహించే హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, విజయభారతి, పద్మజ, జయప్రద, రవి, ప్రభావతిలే పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'స్వామి వివేకానంద' విద్యార్థులు

సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి స్వామి వివేకానంద విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను శుక్రవారం కరస్పాండెంట్ అభినందించారు. కడప నగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో స్వామి వివేకానంద పాఠశాలకు చెందిన ఓంకార్, లలిత, మహిత, లోహిత అనే విద్యార్థులు తమ ప్రతిభను చాటడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక బస్టాండ్, రైల్వే స్టేషన్, ముద్దనూరు రోడ్లల్లో చలికి వణుకుతూ ఇబ్బంది పడే అనాథలకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం అర్ధరాత్రి ఆ సంస్థ ప్రతినిధులు దుప్పటి లేక చలికి అభాగ్యులు పడుతున్న దీనస్థితి నుంచి కొంత స్వాంతన కలిగించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దాతల సాయంతో చలిబారిన నుంచి అనాథలను కాపాడేందుకు ప్రతి సంవత్సరం దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దుప్పటి లేక టవల్‌తో, పట్టలతో, ఒంటిమీద బట్టలతో ఇబ్బంది పడే అనాథలను ఆదుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాతకోట శ్రీనివాసరెడ్డి, టి. వెంకట సురేష్, కేతన శ్రీనాథ్, విజయ్ , నరసింహ పాల్గొన్నారు.


ఆముదం పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

వేరుశనగలో తెగుళ్ల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

వేరుశనగ పంట పూత దశలో ఉందని, బెట్ట రాకుండా పంటని కాపాడుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని శెట్టివారిపల్లె, యామవరం, కొర్రపాడు గ్రామాల్లోని ఆర్‌బికెలను శుక్రవారం ఎఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బికెలలో ప్రతి రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. నానో యూరియా లిక్విడ్ రూపంలో అర లీటరు బాటిల్స్ అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్‌బికె సిబ్బందిని సంప్రదించి తీసుకెళ్లాలని తెలిపారు. రబీలో సాగుచేసిన వేరుశనగ, ఆముదం పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. వేరుశనగ పంటకు ఒక ఎకరానికి 200 కిలోలు జిప్సం చల్లుకుని నీరు పెట్టాలన్నారు. ఆముదం పంటలో రసం పీల్చే పురుగులు పచ్చదోమ, తెల్ల దోమ,పేను బంక ఉధృతి నివారణకు గాను ల్యాన్సర్ గోల్డ్ అనే మందును పిచికారి చేయాలని సూచించారు. ముందస్తుగా వేప నూనె 5 ఎమ్ ఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రబీలో సాగుచేసిన అన్ని పంటలను పంట నమోదు చేసుకోవాలని తెలిపారు

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి అని మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) ప్రొద్దుటూరు శాఖ పట్టణ కార్యదర్శి సాల్మన్ కోరారు.పెండింగ్ వేతనాలు మంజూరు కోరుతూ శుక్రవారం రెండో రోజు నల్లబ్యాడ్జీలు తరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి అన్నారు.జిఒ నఎంఎడఉ ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలన్నారు. క్యాజువల్ లీవు లు ఇవ్వాలన్నారు.విశాఖ ఏజెన్సీ డ్రైవర్‌లకు రూ.15, 000లు ఇస్తున్నారన్నారు.రెడ్డిఏజెన్సీ అమలు చేయాలని లేనిపక్షంలో డిసెంబర్ 4సోమవారం నుండి విందులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. కార్యక్రమంలో పట్టణ కోశాధికారి రాఘవేంద్ర కార్యదర్శి రవి కుమార్ రవి సురేష్ నీతమ్మ పాల్గొన్నారు



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఓటుతోనే ప్రజాస్వామ్య మనుగడ సాధ్యం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వినియో గించుకోవడంతోనే ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యమవుతుందని జమ్మలమడుగు ఆర్‌డిఒ జి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం నుంచి పెద్ద పసుపుల మోటు వరకు డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఓటు ఆవశ్యకతపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నమోదు చేసుకున్న వారు ఓటును వినియో గించుకోవాలన్నారు. చదువుకుంటున్న విద్యార్థులు తల్లిద ండ్రులకు ఓటు విలువను తెలియజేయాలన్నారు. పరిపూర్ణమైన ప్రజాస్వామ్యం ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకున్నప్పుడే ఏర్పడుతుందన్నారు. మార్చి, ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు ఉండవచ్చని ఎన్నికలలో పాల్గొని ఓటింగ్ శాతాన్ని పెంచేలాగా కృషి చేయాల న్నారు. చదువుకున్న మేధావులు ఓటును వినియోగించు కోకపోవడం వల్ల సమర్థవంతమైన వ్యక్తులను ప్రతినిధులుగా ఎన్నుకోలేని స్థితిలోకి వెళ్తా మన్నారు. తెలంగాణలో గతంలో కంటే ఇటీవల నిర్వహించిన ఎలక్షన్లలో ఓటింగ్ శాతం తగ్గిందన్నారు. అందుకు కారణం ఓటింగ్‌కు రాకపో వడమే అన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ షఫీ, జమ్మలమడుగు తహశీల్దార్ గురప్ప, ఎన్నికల సీనియర్ అధికారులు మస్తాన్ వలి, వివేకానంద రెడ్డి, ఎస్‌పి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పాల నాగేశ్వర రెడ్డి, షిర్డీసాయి డిగ్రీ కళాశాల యాజమాన్యం సంజీవ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు, డిగ్రీకళాశాల విద్యార్థులు

విద్యాభివృద్ధికి కృషి

- ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డైరెక్టర్ ఏవీఎస్ఎస్ కుమార స్వామి గుప్తా అన్నారు. శుక్రవారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఫైనాన్స్ ఒఎస్‌డి గంగిరెడ్డి, డీన్ అకాడమిక్ రత్నకుమారి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలోని ట్రిపుల్ ఐటిలో పని చేయడం సంతోషకరంగా ఉందన్నారు. తన స్వస్థలం బ్రహ్మంగారి మఠం మని తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్ క్యాంపస్‌ను అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధ్యాపకులు, ట్రిపుల్ ఐటి అధికారులు, విద్యార్థుల సహకారం అవసరమని చెప్పారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ట్రిపుల్ ఐటికి మంచి పేరు తేవాలని సూచించారు. ట్రిపుల్ ఐటిలో ఉన్న సమస్యలను తన దృష్టికి అధ్యాపకులు, విద్యార్థులు తెస్తే క్యాంపస్ ఉన్నత స్థాయిలో ఉండేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసేందుకు తన సాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన డైరెక్టర్‌ను స్వాగతం పలికిన వారిలో పిఆర్‌ఒ తిరుపతి రెడ్డి, ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు చెందిన అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ట్రిపుల్‌ఐటి డైరెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న ఒఎస్‌డి, డీన్

జాతీయ స్థాయికి ఐడిపిఎస్ స్కూల్ ప్రాజెక్టు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ప్రజాశక్తి - చాపాడు

విజయవాడ కెఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన 31వ జాతీయ బాలల విజ్ఞాన సమ్మేళనం-2023లో స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయ చంద్రారెడ్డి వెల్లడించారు. పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థులు ఎల్లూరి షేక్ మహమ్మద్ అయాన్, నల్ల గారి ఆరాధ్య పదర్శించిన బ్లాక్ గోల్డ్ అనే ప్రాజెక్టు అక్కడికి విచ్చేసిన యూనివర్సిటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తల మన్ననలు పొందిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా వాహనాల పరిశ్రమల నుంచి వెలువడే ప్రమాదకరమైన కార్బన్ మోనాక్సైడ్‌ను సేకరించి జిరాక్స్‌కు ఉపయోగించే ఇంకుగాను, పెయింట్లకుగాను ఉపయోగపడేలా చేయొచ్చనని నిరూపించారని తెలిపారు. ఇలాంటి ప్రయోగాల ద్వారా ప్రస్తుతం ఢిల్లీ ఇలాంటి మహానగరాలలో ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యల నుంచి బయటపడవచ్చుని, తద్వారా ప్రకృతిలోని స్వచ్ఛతను, పచ్చదనాన్ని కాపాడవచ్చునని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్ రెడ్డి మాట్లాడుతూ కాలుష్యం బారి నుండి వాతావరణాన్ని కాపాడుకోవడానికి ఐడిపిఎస్ విద్యార్థులు చేసిన ఈ ప్రయోగం జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఎంతో సంతోషమని తెలుపుతూ విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రాజెక్టు మెంటార్ మిస్టర్ ఎన్.ప్రశాంత్‌ను అభినందించారు. మొత్తం రాష్ట్ర స్థాయికి పోటీ పడిన 184 ప్రాజెక్టుల్లో 17 జాతీయ స్థాయికి ఎంపిక కాగా తమ ప్రాజెక్టు ఉత్తమ స్థానం పొందడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి. రవీంద్ర విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఎడిఎ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రబీ సీజన్‌కు సంబంధించి ఇ-క్రాప్ యాప్‌లో తప్పని సరిగా పంట నమోదు చేయాలని కమలాపురం వ్యవసాయ సంచాలకులు ఎ.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల వ్యవసాయధికారి కార్యాల యంలో ఎర్రగుంట్ల, వీరపునాయనిపల్లి మండలాల పరిధిలోని గ్రామ వ్యవసాయ సహా యకులకు ఈ క్రాప్ బుకింగ్, ప్రస్తుత రబీ సీజన్‌లో చేపట్టాల్సిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్ కు సంబంధించిన ఇ-క్రాప్ బుకింగ్ యాప్ అందుబాటులోకి వచ్చినందున వెంటనే సాగులో ఉన్న పంటలను నమోదు చేయాలని పేర్కొన్నారు. రానున్న రెండు మూడు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామ వ్యవసాయ సహాయకులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంటూ కోత కోసిన పంటను జాగ్రత్తగా నిల్వ ఉంచుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ఆయన ఎర్రగుంట్ల రెవెన్యూ గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న ఇ క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అయన రైతులను మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఇ-క్రాప్ యాప్‌లో పంట నమోదు చేసుకో వాలన్నారు. నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు, పంటల బీమా, నష్టపరిహారం, , కనీస మద్దతు ధర, సున్నా వడ్డీ పంట రుణాలు వంటివి వర్తిస్తాయని చెప్పారు. రానున్న రెండు. మూడు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట కోత చేసుకున్న, కళ్లాలల్లో నిల్వ చేసుకున్న రైతులు ధాన్యాన్ని భద్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల, వీరాపునాయనిపల్లి మండలాల వ్యవసాయ అధికారులు శ్రీకాంత్ రెడ్డి, శ్యామ్ బాబు, కమలాపురం హబ్ వ్యవసాయ అధికారి రవి శంకర్ రెడ్డి పాల్గొన్నారు.


ఇ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ సంచాలకులు ఎ.వి.నరసింహారెడ్డి

కెసిఆర్‌కు లబ్ధి చేకూర్చేందుకే

జగన్నాటకం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల పోలీసులు మధ్య ఉద్రిక్తత నెలకొనడానికి కెసిఆర్‌కు ఎన్నికల్లో లబ్ధి చేకూర్చేందుకే జగన్ నాటకం ఆడినట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద తెలంగాణ, ఆంధ్ర పోలీసులు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 85 ప్రకారం కృష్ణానది మీద తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన అన్ని ప్రాజెక్టులను కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగాలను ఉపయోగించి కృష్ణా బోర్డు నిర్వహించాలని చెప్పారు. ఇందు కోసం బోర్డు పరిమితిని పనులను నిర్దేసిస్తూ 2021లో కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారి చేసిందని చెప్పారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగాలు ఉండి ఉంటే రాష్ట్రాల మధ్య యుద్ధ వాతావరణం వచ్చి ఉండేది కాదని చెప్పారు. ఎన్నికల రోజు తెలంగాణ సెంటిమెంట్ ను రెచ్చగొట్టి తద్వారా కెసిఆర్‌కు ఎన్నికల లబ్ధి చేకూర్చి తెలంగాణలో కాంగ్రెస్‌కు నష్టం కలిగించాలనే దురుద్దేశంతో మోడీ, జగన్, కెసిఆర్ పన్నగాలు పన్నినట్లు ఆరోఇపంచారు. జగన్‌కు స్వార్థ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని చెప్పారు. జగన్ చేస్తున్న ద్రోహం రాష్ట్ర ప్రజలకు తెలుసిందని చెప్పారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లో ఉన్న అన్ని ప్రాజెక్టులను చట్ట ప్రకారం తన అధీనంలోకి తీసుకొని సిఐఎస్ఎఫ్ బలగాలను ప్రాజెక్టుల వద్ద మోహరించాలని తులసిరెడ్డి కోరారు.

యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి- ఖాజీపేట

మండల పరిధిలోని పూజలు కొట్టాల గ్రామానికి చెందిన సురేష్ అనే యువకుడు శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతోపాటు మద్యానికి బానిస అయ్యాడని స్థానిక గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం మై పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు.

అలవలపాడులో గ్రామోత్సవం

వేంపల్లె : మండలంలోని అలవలపాడులో శుక్రవారం ఘనంగా అయ్యప్ప స్వాములు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు అందరూ మంగళ వాయిద్యాలతో, భక్తుల శరణలతో అయ్యప్ప నామస్మరణతో పురవీధుల గుండా అయ్యప్ప స్వామి విగ్రహంతో గ్రామమోత్సం నిర్వహించారు. కార్యక్రమంలో ధృవకుమార్ రెడ్డి, వేమయ్య, అవినాష్ రెడ్డి, కేశవ, శేఖర్, ముని మధురెడ్డితో పాటు పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

నేడు 'పరిశుద్ధ' తిరుణాల

ప్రజాశక్తి-కలసపాడు

మండల కేంద్రంలో సుమారు 136 ఏళ్ల కిందట వెలసిన పరిశుద్ధ పేతురు, పరిశుద్ధ పౌలు చర్చిలో తిరుణాళ్లు నిర్వహించనున్నట్లు పాస్టర్ పి.ఎ.వరప్రసాద్, రెవరాండ్ సంజయ్‌మధు, గాబ్రియేల్, కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రతి ఏడాది అత్యంత వైభవంగా తిరునాళ్లు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. శనివారం సాయంత్రం ఐదు గంటలకు అతిథులకు ఆహ్వానం, చక్కెభజన, క్రైస్తవ సంగీత విభావరి, పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. మైదుకూరు డిఎస్‌పి మురళీగౌడ్, సిఐ చిరంజీవి, ఎస్ఐ నాగమురళి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. మండల వాసులందరూ పాల్గొని తిరుణాళ్లను విజయవంతం చేయాలని కోరారు.




ఉత్తమ పురస్కారం అందుకుంటున్న ఐసిటిసి కౌన్సిలర్ ప్రతాప్‌కుమార్

ప్రతాప్ కుమార్‌కు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి- జమ్మలమడుగు

స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని ఐసిటిసి విభాగంలో కౌన్సిలర్‌గా విధులు నిర్వహిస్తున్న విప్పర్తి ప్రతాప్ కుమార్‌కు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు శుక్రవారం ఉత్తమ పురస్కారాన్ని అందజేశారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రిలో హెచ్ఐవి ఎయిడ్స్ సంబంధించిన అనేక మందికి ఉత్తమ సేవలు అందించినందుకు ఆయనకు ఎయిడ్స్ నియంత్రణ అధికారులు పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత మాట్లాడుతూ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు తన విలువైన సేవలను గుర్తించి జిల్లాలోని ఉత్తమమైన కౌన్సిలర్‌గా తనను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. 12 ఏళ్ల విధి నిర్వహణలో జమ్మలమడుగు పరిసర ప్రాంతాలలో ప్రజలకు, కళాశాల విద్యార్థులకు, జైలలో ఉన్నటువంటి ఖైదీలకు హెచ్ఐవి ఎయిడ్స్, సుఖ వ్యాధుల గురించి అనేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. తన సేవలను జిల్లా హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ అధికారులు గుర్తించి ఉత్తమ సేవకు పురస్కారం అందించిన అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విత్తన ఎంపిక ముఖ్యం

చాపాడు : రైతులు పంటలు సాగు చేసే సమయంలో విత్తన ఎంపిక ఎంతో ముఖ్యమని ఎఆర్ఎస్ సీనియర్ సైంటిస్టు డాక్టర్ జాన్సన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెదురూరులో విత్తనోపాధి పథకం కింద శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విత్తనాలు అధిక దిగుబడి ఇస్తాయో వాటిని ఎంపిక చేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి గురించి రైతులకు వివరించారు.వరి, మినుము సాగు చేసిన రైతులు తీసుకోవాల్సిన మెలుకువలు జాగ్రత్తల గురించి తెలియజేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటకు ఆశించిన తెగుళ్లపై అవగాహన కల్పించారు. యూరియాను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించాలని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌టిసి ఎఒ పద్మజ, మండల వ్యవసాయ అధికారి మ్యాగీ, విఎఎలు వెంకటరమణ, భార్గవి, బేబీ, రైతులు పాల్గొన్నారు.

'జగన్‌ను మరోమారు సిఎంను చేద్దాం'

ప్రజాశక్తి - కొండాపురం

రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అవసరమని కొండాపురం మండలం సుగుమంచిపల్లె వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సుగుమంచిపల్లెలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయం సమీపంలో వైసిపి జెండాను పార్టీ సీనియర్ నాయకులు నాగు ఆదినారాయణరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అధోగతి పాలు కాకుండా అభివృద్ధి పథంలో నడచాలంటే మరోసారి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరం అన్నారు. పేదల అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతూ ప్రతి కుటుంబానికీ అండగా ఉన్నారని చెప్పారు. సచివాలయం, వాలెంటర్ల వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత జగన్మోహనరెడ్డిదేనని, అమ్మ ఒడి మొద లుకొని విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య దీవెనతోపాటు ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయా ల్సిన బాధ్యత ప్రజలకు ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సి.ఆదినారాయణ రెడ్డి, నాగు అమరనాథరెడ్డి, వైసిపి కార్యకర్తలు, అభిమానులు, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. **పెద్దముడియం :** మండల పరిధిలోని పెద్ద పసుపులలో ఎపికి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్థానిక పెద్ద పసుపుల కూడలిలో గ్రామ సర్పంచ్ నిర్మలతో కలిసి వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరమణారెడ్డిమెస్ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, స్థానిక వైస్ సర్పంచ్ రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మనోహర్ యాదవ్, రత్నాకర్ రెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, నడిపి రెడ్డి, శివశేఖర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, పద్మనాభరెడ్డి, సచివాలయ సిబ్బంది వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో చేరిన కుటుంబాలు

వైసిపిలోకి పది కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని 14వ కౌన్సిల్ వార్డులో కౌన్సిలర్ ఆర్ఎస్ జంషీద్ ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సమక్షంలో 10 కుటుంబాలు వైసిపిలో చేరాయి. పార్టీలో చేరిన వారికి స్థానిక ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కౌన్సిలర్ ఆర్ఎస్ జంషీద్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను మెచ్చి స్వచ్ఛందంగా ప్రజలు పార్టీలో చేరుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ షాహిద్, ఖాదర్ వల్లి,ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఘనంగా పాలెం దొరస్వామి నాయుడు వర్ధంతి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని అహోబిలాపురం మెయిన్ పాఠశాలలో ఘనంగా పాలెం దొరస్వామి నాయుడు వర్ధంతి వేడుకలను శుక్రవారం కుటుంబ సభ్యులు పాలెం బలరాం నాయుడు, శివ శంకర్ నాయుడు, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కుటుంబ సభ్యులు దొరస్వామినాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం పాలెం దొర స్వామి నాయుడు తన సొంత స్థలాన్ని పాఠశాలకు ఇచ్చారని చెప్పారు. అక్కడ పాఠశాలను ఏర్పాటు చేసిన తర్వాత ఆయన విగ్రహాన్ని జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేశారని తెలిపారు. తరువాత పాఠశాలలో బాగా చదివి ట్రిపుల ఐటికి ఎంపికైన అయిన విద్యార్థులకు ఒకొక్కరికి ప్రోత్సహాకంగా రూ. 12 వేలను అందజేశారు. చక్కగా చదివి పాఠశాలకు , తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు కమటం రాము, బలిజ సంఘం ఉపాధ్యక్షులు తోటం శెట్టి హరే కృష్ణ రాయల్, ఆంజనేయులు, శంకర్, దొరస్వామి నాయుడు కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.


నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది